ప్రజాశక్తి

బుధవారం 28 ఆగస్టు 2024 5 విజయనగరం

29న 5కె రెడ్‌రన్ మారథాన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

హెచ్‌ఐవి, ఎయిడ్స్ పట్ల యువతకు అవగాహన కల్పించేందుకు ఈనెల 29న ఉదయం 6గంటలకు విజ్జీ స్టేడియంలో 5కె రన్ మారథాన్ పోటీలు నిర్వహించనున్నట్లు టిబి, లెప్రసీ కంట్రోల్ అధికారి డాక్టర్ కె.రాణి తెలిపారు. రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు యువతలో అవగాహన పెంపొందించేందుకు, క్రమశిక్షణతో జీవించడంలో భాగంగా ఈ యూత్ ఫెస్ట్ రెడ్ రన్ మారథాన్ చేపడుతున్నామని తెలిపారు. జిల్లా క్రీడా శాఖ అధికారుల సమన్వయం, నెహ్రూయువ కేంద్రం, ఉన్నత విద్య శాఖ, కళాశాల రెడ్ రిబ్బన్ క్లబ్‌లు, కళాశాల జాతీయ సేవ పథకం విభాగాల అధికారుల సహకారంతో ఈ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 17ఏళ్ల వయసు నుండి 25 సంవత్సరాల వయసు గల వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు చర్యలు

- ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికను సిద్ధం చేయాలి
- జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

స్థాయి సంఘ సమావేశాల్లో మాట్లాడుతున్న జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

సీజనల్ వ్యాధులను అరికట్టి ప్రజల ఆరోగ్యానికి భద్రత కల్పించాలని జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు కోరారు. జిల్లాలో మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా తక్షణమే అన్ని రకాల చర్యలను తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ 1,2,4,7వ స్థాయి సంఘ సమావేశాలు జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు అధ్యక్షతన, 3వ స్థాయి సంఘ సమావేశం వైస్ ఛైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన, 5వ స్థాయి సంఘ సమావేశం ఆ సంఘ ఛైర్‌పర్సన్ శాంతకుమారి అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. సీజనల్ వ్యాధులను దృష్టిలో పెట్టుకొని ముందుగా వైద్యారోగ్యశాఖపై చర్చ జరిగింది. మలేరియా, డెంగీ తదితర సీజనల్ వ్యాధులు రెండు జిల్లాల్లో విపరీతంగా ఉన్నాయని, ప్రతీ ఇంటిలో జ్వర పీడితులు ఉన్నారని చైర్మన్ శ్రీనివాసరావు అన్నారు. పార్వతీపురం మన్యం జిల్లా జియ్యమ్మవలస మండలం బట్లభద్ర గ్రామంలో ఇటీవల తల్లీకూతుళ్లు మరణించిన విషయాన్ని ప్రస్తావించారు. ఇటీవల జిల్లాలో స్వైన్‌ఫ్లూ కేసు కూడా నమోదయ్యిందని, వైద్యారోగ్యశాఖ ఏం చేస్తోందని ప్రశ్నించారు. పిహెచ్‌సిలకు వెళ్తే పై ఆసుపత్రులకు రిఫర్ చేసేస్తున్నారని, ఇది సరైన పద్ధతి కాదని అన్నారు. రెండు జిల్లాల వైద్యారోగ్యశాఖ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు తక్షణ చర్యలు చేపట్టి ప్రజల ప్రాణాలకు భరోసా నివ్వాలని ఆదేశించారు.

కురుపాం ఎంఎల్‌ఎ తోయక జగదీశ్వరి మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల విజృంభణకు కారణాలను కనుగొని, వాటిని అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ముఖ్యంగా గ్రామాల్లో పారిశుధ్యంపై దృష్టిపెట్టి, దానిని మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. అవవసరమైన మందులు, సెలైన్, పరికరాలు పిహెచ్‌సిల్లో నిల్వ ఉంచాలని, సకాలంలో వైద్యం అందించాలని సూచించారు. విజయనగరం ఎంఎల్‌ఎ పూసపాటి అదితి విజయలక్ష్మీ గజపతిరాజు మాట్లాడుతూ, సీజనల్ వ్యాధులు విజృంభించకముందే, వాటిని అరికట్టేందుకు ముందుగానే చర్యలను తీసుకుంటే బాగుండేదని అన్నారు. ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం కరువయ్యిందని చెప్పారు. వ్యాధుల విజృంభనకు కారణాలను ఇతర శాఖలపైకి నెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఆస్పత్రుల్లో ఒకే పడకపై ఇద్దరు రోగులను ఉంచే పరిస్థితి ఎందుకొచ్చిందని ప్రశ్నించారు. వసతి చాలకపోతే తమ దృష్టికి తీసుకువస్తే, ప్రత్యామ్నాయం చూపేవారమని చెప్పారు.

ఎంఎల్‌సి పెనుమత్స సురేష్ బాబు మాట్లాడుతూ, గ్రామాల్లో పారిశుధ్యం బాగోలేదన్నారు. గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తున్నాయని, వాటిని అరికట్టాలని సూచించారు. వైస్ చైర్మన్ బాపూజీనాయుడు అధ్యక్షతన జరిగిన 3వ స్థాయి సంఘ సమావేశంలో వ్యవసాయ పరిసితిపై చర్చించారు. విజయనగరం జిల్లాలో బొండపల్లి, గజపతినగరం, విజయనగరం, గంట్యాడ మండలాల్లో ఉబాలు పూర్తి కాలేదని తెలిపారు. సెప్టెంబరు మొదటి వారం వరకు అవకాశం ఉందని వ్యవసాయాధికారులు తెలిపారు. ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించాలని, వెద జల్లేందుకు విత్తనాలను సిద్దం చేయాలని జెడ్‌పి ఛైర్మన్ సూచించారు. కౌలు రైతులందరికీ రుణాలు అందించాలని సూచించారు. ఛైర్‌పర్సన్ శాంత కుమారి అధ్యక్షతన మహిళా శిశుసంక్షేమంపై చర్చ జరిగింది. జిల్లాలో ఎన్‌జిఒల ఆధ్వర్యంలో అనాథ శరణాలయాలు, బాలల వసతి కేంద్రాలను తనిఖీ చేసి, అక్కడ వసతి, భద్రతా ఏర్పాట్లపై నివేదికను అందజేయాలని జెడ్‌పి ఛైర్మన్ ఆదేశించారు. సమావేశంలో జెడ్‌పి సిఇఒ శ్రీధర్‌రాజా, డిప్యూటీ సిఇఒ రాజ్‌కుమార్, రెండు జిల్లాల జెడ్‌పిటిసి సభ్యులు, వివిధ శాఖల అధికారులు

పరిశ్రమల్లో భద్రత తప్పనిసరి

- ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలి
- వారంరోజుల్లో అంతర్గత భద్రత ఆడిట్ నిర్వహణ
- జిల్లాస్థాయి భద్రత చర్యల కమిటీ భేటీలో కలెక్టర్
- విపత్తులను ఎదుర్కొనే ప్రణాళికలు ఉండాలి : ఎస్‌పి

పరిశ్రమల యజమానుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో పరిశ్రమలు తమ సంస్థల్లో భద్రతకు అవసరమైన చర్యలు తప్పనిసరిగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చెప్పారు. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా నిర్దేశిత ప్రమాణాల మేరకు ఆయా భద్రత ఏర్పాట్లను వారం రోజుల్లోగా పూర్తిచేసి అంతర్గత ఆడిట్ నివేదికను అందజేయాలని యాజమాన్యాలకు స్పష్టంచేశారు. జిల్లాలోని పరిశ్రమల్లో చేపట్టాల్సిన భద్రత చర్యలపై సమీక్షించేందుకు ఆయా పారిశ్రామిక యాజమాన్యాలతో కూడిన జిల్లా స్థాయి క్రైసెస్ మేనేజ్‌మెంట్ గ్రూపు సమావేశం ఫ్యాక్టరీల తనిఖీశాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అంతర్గత ఆడిట్ పూర్తయినట్లు తెలియజేస్తే ఆయా పరిశ్రమలను జిల్లా స్థాయి అధికారులు, నిపుణులతో కూడిన కమిటీలు తనిఖీ చేసి భద్రతకు నిర్దేశిత ప్రమాణాల మేరకు అన్ని చర్యలు తీసుకున్నదీ లేనిదీ నిర్ధారిస్తాయని పేర్కొన్నారు. పరిశ్రమలు భద్రత చర్యలు చేపట్టడంతోపాటు భద్రత చర్యలపై మాక్ డ్రిల్ నిర్వహించి ఏవైనా ఘటనలు, ప్రమాదాలు జరిగినపుడు ఎలా వ్యవహరించాలనే అంశంపై అవగాహన కల్పించాలన్నారు. ఉద్యోగుల్లోనూ భద్రత పరంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కలిగించాలన్నారు. ఆయా ఫ్యాక్టరీల పరిసర ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కూడా భద్రత చర్యలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ పేర్కొన్నారు.

సమావేశానికి హాజరైన పరిశ్రమల యజమానులు, పలు శాఖల అధికారులు

ఎస్‌పి వకుల్ జిందాల్ మాట్లాడుతూ ప్రతి పరిశ్రమకూ ఏదైనా ప్రమాదం లేదా విపత్తు జరిగినపుడు తక్షణం ఎలా స్పందించాలి, ఎలాంటి చర్యలు చేపట్టాలనే అంశంపై స్పష్టమైన ప్రణాళిక ఉండాలని చెప్పారు. ప్రమాదాలు లేని జిల్లాగా రూపొందించడంలో అన్ని పరిశ్రమల యాజమాన్యాలు సహకరించాలని కోరారు.పరిశ్రమలు తమ వద్ద వున్న భద్రత ప్రమాణాలను పునఃసమీక్షించుకోవాలని, అవి ప్రస్తుత పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగినవిధంగా వున్నాయా లేదా అనే అంశాన్ని పరిశీలించి అప్‌గ్రేడ్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఎస్.సేతు మాధవన్ కోరారు. ప్రతి సంస్థ భద్రత చర్యలకు సంబంధించి ఒక సేఫ్టీ సూపర్ వైజర్‌ను నియమించుకోవాలని సూచించారు. ప్రమాదకర రసాయనాలు నిల్వ చేసే ట్యాంకులు ఏవైనావుంటే వాటిని తరచుగా గమనించాలన్నారు. పరిశ్రమలో ఎలక్ట్రికల్ సర్క్యూట్‌లు సక్రమంగా వున్నదీ లేనిదీ నిత్యం తనిఖీలు చేయాలన్నారు. ఫ్యాక్టరీల విభాగం డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ సురేష్ మాట్లాడుతూ జిల్లాలో నాలుగు భారీ పరిశ్రమలు వున్నాయని తెలిపారు. ఈ పరిశ్రమల్లో చేపట్టిన భద్రత చర్యలపై ఎస్‌ఎంఎస్ ఫార్మా, హెచ్‌బిఎల్., మైలాన్ సంస్థల ప్రతినిధులు వివరించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ డిడి కోటేశ్వరరావు, ఆర్‌డిఒలు ఎంవి సూర్యకళ, బి.శాంతి, సుధారాణి, డిప్యూటీ లేబర్ కమిషనర్ సుబ్రహ్మణ్యం, కాలుష్య నియంత్రణ మండలి ఇఇ సరిత, ఎపిఐఐసి అధికారులు మురళీమోహన్, రామకృష్ణ, అగ్నిమాపక అధికారులు, వివిధ పారిశ్రామిక సంస్థల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోలీసు కుటుంబాలకు అండగా ఉంటాం : ఎస్‌పి

ప్రజాశక్తి-విజయనగరం కోట

ఉద్యోగ విరమణ చేసిన, సర్వీసులో ఉంటూ మృతి చెందిన పోలీసు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ చెప్పారు. పోలీసు సంక్షేమంలో భాగంగా ఆయా కుటుంబాలతోపాటు హోంగార్డుల కుటుంబ సభ్యులతో మంగళవారం సమావేశమై, వారి సమస్యలు గురించి ఆరా తీశారు. వారి వ్యక్తిగత, ప్రభుత్వం నుంచి ఇంకా రావాల్సిన బకాయిలు, ఇతర రాయితీలు గురించి సమీక్షించారు. ఈ సందర్భంగా ఎస్‌పి ప్రభుత్వం నుంచి రావాల్సిన భద్రత, జిపిఎఫ్, ఎపిజిఎల్‌ఐ, చేయూత, విడో ఫండ్, కార్పస్ ఫండ్, అడిషినల్ కార్పస్ ఫండ్, గ్రూఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్, లీవ్ ఎన్ క్యాష్ మెంట్ నగదు వంటి ప్రభుత్వం నుండి రావాల్సిన రాయితీలు సకాలంలో అందినది లేనిది అడిగి తెలుసుకున్నారు. . వాటిని త్వరితగతిన వారి కుటుంబ సభ్యులకు అందే విధంగా చర్యలు చేపట్టాలని, కార్యాలయ ఉద్యోగులను ఆదేశించారు. విధి నిర్వహణలో మరణించిన పోలీసు కుటుంబాలకు పెండింగులో ఉన్న కారుణ్య నియామకాలపై ఆరా తీసారు. కొంత మంది పోలీసు కుటుంబాలకు ప్రభుత్వం నుండి పెండింగులో ఉన్న జిపిఎఫ్, గ్రూఫ్ ఇన్సూరెన్స్, ఎన్‌క్యాష్‌మెంట్ లీవ్, పింఛను, కారుణ్య నియామకాలు గురించి రావలసి ఉన్నాయని తెలిపారు. కుటుంబ సభ్యులకు ఏ అవసరమున్నా తమను సంప్రదించ వచ్చునని తెలిపారు. అదనపు ఎస్‌పి అస్మా ఫర్వీన్, ఎఆర్ డిఎస్‌పి యూనివర్స్, స్పెషల్ బ్రాంచ్ సిఐ ఎ.వి. లీలారావు, మహిళా పిఎస్ సిఐ ఇ.నర్సింహమూర్తి, ఆర్‌ఐ ఎస్.గోపాల నాయుడు, పోలీసు అసోసియేషను రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పివిజి రాజు ఆశయాలకు తూట్లు : ఎస్‌ఎఫ్‌ఐ

ప్రజాశకి-విజయనగరం టౌన్

విద్యా ప్రదాత అయిన పివిజి రాజు ఆశయాలకు నేడు తూట్లు పొడుస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు డి.రాము, సిహెచ్ వెంకటేష్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం విజయనగరం కోటలో డాక్టర్ పివిజి రాజు శతజయంతి సందర్భంగా పుస్తకావిష్కరణ కార్యక్రమానికి అనేకమంది ప్రముఖులు హాజరై పివిజి రాజు సేవలను కొనియాడారని తెలిపారు. గొప్ప ఆశయాలు కలిగిన పివిజి రాజు ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి జరగడం లేదని తెలిపారు. పివిజి రాజు విద్యాదాతగా నిలబడితే దానికోసం విద్యాసంస్థల్ని ఏర్పాటు చేస్తే ఆయన తరువాత తరం ఆ విద్యాసంస్థలను మూసివేసిందని పేర్కొన్నారు. కోటలో ఉన్న మహిళా డిగ్రీ కాలేజీని, ఇంటర్మీడియట్ కాలేజీని, మహారాజా హైస్కూల్స్‌ను మూసివేశారని తెలిపారు. ఒకప్పుడు ఎంఆర్ డిగ్రీ కళాశాల ఉండడం వలన ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవసరం విజయనగరం జిల్లా కేంద్రానికి రాలేదని, ఇప్పుడు అది ప్రైవేటీకరణ అయిన తర్వాత చాలామంది పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదవలేక పోతున్నారని తెలిపారు. గొప్ప లక్ష్యంతో ప్రారంభమైన ఎంఆర్ విద్యాసంస్థలు నేడు అధిక ఫీజులు వసూలు చేసే వ్యాపార సంస్థలుగా మారిపోయాయని విమర్శించారు. మహారాజా హటానమస్ డిగ్రీ కాలేజీని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గా మార్పు చేసేందుకు ప్రభుత్వ ఆధీనంలోనే నడిచేలా చూడాలని, అప్పుడే ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్య అందుతుందని పేర్కొన్నారు. ఇదే మనం పివిజికి ఇచ్చిన నిజమైన నివాళని ఎస్‌ఎఫ్‌ఐ భావిస్తుందని తెలిపారు. లేకపోతే ఆయన పేరు చెప్పుకొని ఆయన ఆశయాలకు తూట్లు పొడిచిన వారమే అవుతామని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

2న విధులకు హాజరు కాలేం

ఎంఇఒకు స్కూలు ఆయాల నోటీసు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్లకు గత 5 నెలలుగా జీతాలు బకాయిలు ఉన్నాయని, వాటిని తక్షణమే ఇవ్వాలని కోరుతూ సెప్టెంబర్ 2న కలెక్టరేట్ ధర్నాకు వెళ్తున్నామని, ఆరోజు విధులకు హాజరుకాలేమని విజయనగరం ఎంఇఒ సత్యవతికి యూనియన్ కార్యదర్శి వై.నందిని, సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్ ఆధ్వర్యాన మంగళవారం నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 7గంటల వరకు పనిచేస్తున్నామని, పని భారం తీవ్రంగా ఉందని, అనారోగ్యం వచ్చినా సెలవు లేదని, మనిషిని పెట్టాల్సి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ గర్ల్స్ హైస్కూల్లో ఎనిమిది వందల మంది పిల్లలకు ముగ్గురు ఆయాలు బాత్రూమ్ లు, మరుగుదొడ్లు, తరగతి గదులు శుభ్రం చేయడం, పిల్లల్ని కంట్రోల్ చేయడం ఎలా సాధ్యమని ప్రశ్నించారు.దిఎస్‌ఐ, పిఎఫ్, సిక్ లీవులు, మెటర్నటీ లీవులు లేవన్నారు. జీతం రూ.12 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో యూనియన్ ఉపాధ్యక్షులు ఎస్.పార్వతి, సావిత్రి, సత్యరేవతి తదితరులు పాల్గొన్నారు.

పిఎంవివై కింద రూ.2లక్షల రుణాలు : కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన కింద 18 రకాల కుల వృత్తులు, చేతి వృత్తులు, సాంప్రదాయ వృత్తులు చేసేవారికీ రూ.2లక్షల వరకు రుణాలు అందజేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ తెలిపారు. ప్రభుత్వం జారీ చేసిన విశ్వకర్మ ఐ.డి.కార్డు కలిగిన వారికి 5 రోజులు ప్రాథమిక శిక్షణ ఇచ్చి శిక్షణ అనంతరం రూ.15 వేలు విలువ చేసే టూల్ కిట్ ఇన్సెంటివ్ గా మంజూరు చేస్తామని తెలిపారు. వ్యాపారం చేసుకునేందుకు లక్ష రూపాయల రుణం 5 శాతం వడ్డీతో మొదటి విడతగా బ్యాంకు నుంచి ఇస్తామని తెలిపారు. ఈ రుణం 18 నెలల్లో తీర్చవలసి ఉంటుందని, తరువాత మరో 15 రోజులు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వారికి రూ.2 లక్షల వరకు 5 శాతం వడ్డీతో బ్యాంకు రుణం ఇస్తామని తెలిపారు. మంగళవారం కలెక్టర్ ఛాంబర్ లో ప్రధాన మంత్రి విశ్వకర్మ యోజన పథకం జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు. జిల్లా లో విశ్వకర్మ పోర్టల్ నందు దరఖాస్తు చేసుకున్న వాటిని సచివాలయం లో పరిశీలన చేసిన జాబితాలో అర్హత కలిగిన దరఖాస్తులను పరిశీలించారు. జిల్లాలో ఈ పథకం కింద 5584 దరఖాస్తులు అందాయని, రెండు రోజుల్లో రీ వెరిఫికేషన్ చేసి సమర్పించాలని తెలిపారు. సమావేశం లో పరిశ్రమల శాఖ డిడి నాగేశ్వర రావు, డిపిఒ శ్రీధర్ రాజా, స్కిల్ డెవలప్మెంట్ అధికారి గోవింద రావు, మెప్మా పీడీ సుధాకర్ రావు, బిసి కార్పొరేషన్ ఇడి పెంటోజీ రావు తదితరులు పాల్గొన్నారు.

14న జాతీయ లోక్అదాలత్

ప్రజాశక్తి-విజయనగరం లీగల్

వచ్చేనెల 9న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను జయప్రదం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి తెలిపారు. మంగళవారం విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాల న్యాయ మూర్తులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీ కాదగ్గ క్రిమినల్, సివిల్ కేసులను గుర్తించి వాటిని జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించాలని సూచించారు. ఎక్కువ సంఖ్యలో మోటారు ప్రమాద బీమా కేసులను రాజీ చేయాలని సూచించారు.

హౌసింగ్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న హుదూద్ బాధితులు, సిపిఎం నాయకులు

హుదూద్ ఇళ్లకు విద్యుత్ ఇవ్వాలని సిపిఎం ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో హుదూద్ బాధితులకు లంకా పట్నంలో నిర్మించిన ఇళ్లకు మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ గృహ నిర్మాణశాఖ కార్యాలయం వద్ద సిపిఎం ఆధ్వర్యాన మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా హుదూద్ బాధితులకు మాత్రం ఇళ్లను అప్పగించడం లేదన్నారు. చివరికి సిపిఎం ఆధ్వర్యాన 2023 నవంబర్ లో 290 మందిని ఇళ్లల్లో దించారని, అక్కడ నివాసం ఉన్న వారికి నేటికీ కరెంట్, మంచినీరు, మౌలిక సదుపాయాలు కల్పించలేదని అన్నారు. ఇప్పటికైనా కరెంట్ మీటర్లు ఇచ్చి, కరెంట్ వైర్లు రిపేరు చేసి అధికారికంగా ఇళ్లు అప్పగించాలని డిమాండ్ చేశారు. హౌసింగ్ ఎఇ వచ్చి వారం రోజుల్లో వారం రోజుల్లో మీటర్లకు దరఖాస్తు చేసి, 15రోజుల్లో ఇళ్లు అప్పగిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డివై ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి హరీష్, రంభ శ్రీనివాసరావు, కర్రిరమణమ్మ, హుదూద్ బాదితులు పాల్గొన్నారు.

నిలిచిన ఇవిఎం పరిశీలన

ప్రజాశక్తి-నెల్లిమర్ల

విజయనగరం పార్లమెంటు స్థానంలో వైసిపి అభ్యర్థిగా పోటీ చేసిన బెల్లాన చంద్రశేఖర్ చేసిన దరఖాస్తు మేరకు ఇవిఎం పరిశీలనకు ఎన్నికల సంఘం ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేరకు బెల్లానకు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి నుంచి నోటీసు ఇవ్వగా, ఆయన మంగళవారం ఉదయం 10 గంటలకు నెల్లిమర్ల ఇవిఎం గోదాముల వద్దకు చేరుకున్నారు. తాను ఎంపిక చేసుకున్న పోలింగ్ కేంద్రం కంట్రోల్ యూనిట్ బ్యాటరీ పవర్ పర్సంటేజ్‌ను ఆయన అడిగారు. అయితే ఇసిఐ ప్రస్తుత టెక్నికల్ ఎస్‌ఒపిలో బ్యాటరీ పవర్ పర్సంటేజ్ లేదని బెల్ ఇంజినీర్లు, అధికారులు వారికి తెలిపారు. దీంతో ఇవిఎం పరిశీలనకు బెల్లాన నిరాకరించినందున పరిశీలన జరగలేదని కలెక్టర్ తెలిపారు.

కుప్పానాయుడు ఆశయ సాధనకు కృషి

వర్ధంతి సభల్లో ప్రజాసంఘాల నాయకులు

ప్రజాశక్తి-మెంటాడ/గజపతినగరం/విజయనగరంటౌన్

వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు, అందరూ కమ్యూనిస్టు మాస్టారుగా పిలిచే డాక్టర్ ఆర్.కుప్పానాయుడు ఆశయ సాధనకు అందరం కృషి చేయాలని పలువురు నాయకులు అన్నారు. కుప్పానాయుడు 12వ వర్ధంతి సభ మంగళవారం గజపతినగరం మండలం పురిటిపెంట, మెంటాడ మండల కేంద్రం, విజయనగరంలోని ఎల్‌బిజి భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా కుప్పానాయుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

మెంటాడలో కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆర్.రాములు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో వ్యవసాయకార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.శ్రీనివాస్ మాట్లాడారు. నిరుపేదలు, దళిత, గిరిజనులు,కార్మికుల సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన ఆదర్శప్రాయుడు కుప్పానాయుడు అని కొనియాడారు. ఉన్నత చదువులు చదివి పేదల బతుకులపై పిహెచ్‌డి చేసి ప్రజా పోరాటాలే శరణ్యమని భావించి, ప్రజా చైతన్యంతోనే మార్పు వస్తుందని గుర్తించి పేదలకు సంఘాలు పెట్టి చైతన్య పరిచారని తెలిపారు. గిరిజనులకు భూములు సాధించారని, గజపతినగరం, మెంటాడ మండలాల్లోని పలు గ్రామాల పేదలకు ఇళ్ల స్థలాలకు కృషి చేశారని తెలిపారు. ఆంధ్ర రిజర్వాయర్, గుర్ల గెడ్డ సాధన కోసం తన వంతు పాత్ర పోషించారని అన్నారు. అనేక సంఘాల పోరాటాలు ఫలితంగానే అటవీ హక్కుల చట్టం, ఉపాధి హామీ చట్టం వచ్చాయని తెలిపారు. ఈ చట్టాల సాధనకు జరిగిన పోరాటాల్లో కుప్పానాయుడు తన వంతు పాత్ర పోషించారని గుర్తు చేశారు.ఆయన స్ఫూర్తితో అటవీ హక్కులచట్టం,ఉపాధి హామీ చట్టాలను కాపాడుకోవాలని, రైతులకు గిట్టుబాటు ధరను, ప్రాజెక్టులను సాధించుకోవాలని పిలుపునిచ్చారు. కుప్పానాయుడి స్ఫూర్తితో వాడవాడలా ప్రజా సంఘాలు పెట్టి ప్రజలను చైతన్యంచేసి హక్కులను సాధించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి ఎం.అప్పల నరసయ్య, గిరిజన సంఘం మండల కార్యదర్శి టి.సోములు, డప్పుకళాకారుల సంఘం నాయకుడు బి.సన్యాసి, సింహాచలం, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు

మెంటాడ : వర్ధంతి సభలో మాట్లాడుతున్న వ్యకాస నాయకుడు జి. శ్రీనివాస్

గజపతినగరం మండలం పురిటిపెంట దళిత కాలనీలోని కుప్పానాయుడు స్థలం వద్ద జరిగిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి సిఐటియు జిల్లా కార్యదర్శి వి.లక్ష్మి, రైతు సంఘం నాయకులు ఎస్.బంగారునాయుడు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ కుప్పానాయుడు తన జీవితంలో ఎక్కువ భాగం పురిటిపెంటలోనే నిరాడంబర జీవనం గడిపారని అన్నారు. ఎంతోమంది యువకులను వామపక్ష భావజాలం వైపు నడిపించారని తెలిపారు. పురిటిపెంట, గజపతినగరంలో కూలి రేట్లుకోసం, ఇళ్లు, ఇళ్ల స్థలాలు, ఎంఎన్‌ఛానల్ కోసం పోరాటాలు చేశారని గుర్తు చేశారు.ఆయన స్ఫూర్తితో పేదల హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ఉపాధ్యక్షులు హరికృష్ణ, వేణి, జె్రరిరాము, దాసరి సింహాద్రి, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

కుప్పానాయుడు జీవితం స్ఫూర్తిదాయకం

విజయనగరం ఎల్‌బిజి భవన్‌లో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు రెడ్డి శంకర్రావు అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో కుప్పానాయుడు

విజయనగరం : కుప్పానాయుడుచిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సిపిఎం నాయకులు, కార్యర్తలు

చిత్రపటానికి ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.శ్రీనివాస పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుప్పానాయుడు జీవితం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించి,డాక్టరేట్ పొందిన ఆయన గిరిజనులు,వ్యవసాయ కార్మికుల బతుకుల బాగు కోసం పని చేశారన్నారు. తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి సిపిఎం పార్టీ నాయకుడిగా గిరిజనులు, వ్యవసాయ కార్మికుల కోసం బతికున్నంత కాలం పని చేశారని అన్నారు. నేడు ప్రజా ఉద్యమాల్లో ఉన్న యువత,ప్రజా సంఘాలు నాయకులు ఆయన ను స్ఫూర్తిగా తీసుకుని సిపిఎం బలోపేతం కోసం, ప్రజా ఉద్యమం నిర్మాణానికి కృషి చేయాలని, అప్పుడే ఆయనకు నిజమైన నివాళి అని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎ.జగన్మోహన్, కె.సురేష్, కార్యాలయం కార్యదర్శి కృష్ణ, హరీష్, డి.రాము తదితరులు పాఇల్గొన్నారు.

గజపతినగరంలో నివాళులర్పిస్తున్న రైతుసంఘం, వ్యకాస నాయకులు,కార్యకర్తలు

ఎంఇఒకు వినతి పత్రాన్నిస్తున్న గ్రామస్తులు

మారికలో పాఠశాల పరిశీలన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని మారిక గిరిజన గ్రామంలో ఉన్న ప్రాథమిక పాఠశాలను ఎంఇఒ. జి. జగదీశ్వర రావు మంగళవారం పరిశీలించారు. గిరిజన గ్రామానికి ఉపాధ్యాయుడు ఉన్నప్పటికీ సరిగా హాజరు కావడం లేదని పాఠశాలకు వెళ్లని ఉపాధ్యాయులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఎంఇఒ. జగదీశ్వరరావును జిల్లా సిపిఎం నాయకులు చల్లా జగన్, గాడి అప్పారావులు ప్రశ్నించారు. పాఠశాలకు గైర్హాజరవుతున్న ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం ఇదే విషయంపై గ్రామస్తులు ఎంఇఒకు వినతి పత్రాన్ని అందించారు. పరిశీలనలో సిఆర్‌పి కె. రాంప్రసాద్ గిరిజనులు ఉన్నారు.

గదబవలసలో పిఎం జన్‌మన్‌పై అవగాహన

ప్రజాశక్తి - వేపాడ

మండలంలోని పికెఆర్‌పురం పంచాయతీ పరిధిలోని గదబవలసలో మంగళవారం పిఎం జన్‌మన్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఎంపిడిఒ పట్నాయక్ గ్రామానికి అవసరమైన మౌలిక సదుపాయాల గురించి గ్రామస్తులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎం.జగ్గులు, ఉప సర్పంచ్, గ్రామ పెద్దలు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, పంచాయతీ కార్యదర్శులతో పాటు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వేపాడలో భారీ అన్నదానం

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రంలో యాదవ కులస్తులందరూ కృష్ణాష్టమిని పురస్కరించుకుని మంగళవారం భారీ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యాదవ సంఘం యువకులు, పెద్దలు, మహిళలతో పాటు గ్రామ పెద్దలు గుమ్మడి నరసింహమూర్తి తదితరులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బొబ్బిలి

అనారోగ్యంతో బాధపడుతున్న దీర్ఘకాలిక రోగి ఎస్.సత్యంకు ఎమ్మెల్యే బేబినాయన ఆర్థిక సహాయం చేశారు. పట్టణంలోని రావునగర్ కాలనీకి చెందిన సత్యం కొన్ని నెలలుగా దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ మంచానికి పరిమితం కావడంతో కాలనీ టిడిపి కార్యకర్తలు కౌన్సిలర్ ఆర్.శరత్ దృష్టికి తీసుకుని వెళ్లగా ఆయన ఎమ్మెల్యే బేబినాయనకు చెప్పడంతో ఆర్థిక సహాయం చేశారు. నగదును టిడిపి కార్యకర్తలు సత్యంకు అందజేశారు. కష్టాల్లో ఉన్న సత్యంకు ఆర్థిక సహాయం చేసిన బేబినాయనకు కాలనీ ప్రజలు కృతజ్ఞతలు చెప్పారు.

నెల్లిమర్లలో ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్

నగర పంచాయతీ లోని 7వ వార్డులో మంగళవారం ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం కౌన్సిలర్ మైపాడ ప్రసాద్ ఆధ్వర్యంలోని తన ఇంటి వద్ద నిర్వహించారు. విశాఖపట్నం కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత కార్డియాలజీ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి డాక్టర్ ఎన్. వి. ప్రసాద్ 39మంది రోగులకు బిపి, రేండం బ్లడ్ షుగర్, ఈసిజి, సెకండ్ ఎకో స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించి ముగ్గురు రోగులను ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో కిమ్స్ ఐకాన్ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

బొబ్బిలి: స్థానిక విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయంలో బుధవారం విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఇఇ ఆవాల అనంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి రూరల్ సబ్ డివిజన్ పరిధిలో తెర్లాం, రామభద్రపురం, బాడంగి మండలాల విద్యుత్ వినియోగదారుల సమస్యలపై సి.జి.ఆర్.ఎఫ్ ఛైర్మన్ సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు వి.జనార్ధనరావు, ఆర్థిక సభ్యులు ఎం.శ్రీనివాస్, స్వతంత్ర సభ్యులు ఆర్.సురేంద్ర కుమార్ వేదిక నిర్వహిస్తారని చెప్పారు. ఉదయం 11.30గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు వేదిక ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి - నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని థామస్ పేటకు చెందిన అంతరపల్లి శంకరరావు(30) మంగళవారం తన ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తండ్రి ఫిర్యాదు మేరకు తన కుమారుడు తరచు భార్యతో గొడవలు పడి పలుమార్లు పోలీస్ స్టేషన్‌కి వెళ్లడంతో మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు చెప్పాడు. మృతునికి భార్య, పిల్లలు ఉన్నారు. స్థానిక ఎస్ఐ డి. రామ గణేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న ఎఒ హరికృష్ణ

పంటకోత ప్రయోగాలపై శిక్షణ

ప్రజాశక్తి - భోగాపురం

పంటకోత ప్రయోగాలపై స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయ అధికారి హరికృష్ణ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలతో అనేక లాభాలు ఉన్నాయన్నారు. పంటకోత ప్రయోగాలలో సరాసరి దిగుబడి తగ్గినప్పుడు ప్రభుత్వం నుంచి ఇన్సూరెన్స్ పొందవచ్చునని చెప్పారు. 250 ఎకరాలు ఒక క్లస్టర్‌గా ఏర్పాటు చేసి ఒక్కో క్లస్టర్‌లో నాలుగు పంటకోత ప్రయోగాలు నిర్వహించాలన్నారు. తహశీల్దార్ సురేష్ మాట్లాడుతూ పంటకోత ప్రయోగాలు ఒక పద్ధతిగా నిర్వహించాలన్నారు. దీని ద్వారా మండలంలో పంట దిగుబడిని సరాసరిగా అంచనా వేయొచ్చని తెలిపారు. మండల ఉపగణాంక అధికారి చరణ్ ప్రసాద్ మాట్లాడుతూ ఈ ఏడాది వరి పంట పంటకోత ప్రయోగానికి ఎంపికైందన్నారు. 1600 ఎకరాలలో వరి విస్తీర్ణం మండలంలో జరుగుతుందని తెలిపారు. అనంతరం గ్రామ రెవెన్యూ అధికారులకు, వ్యవసాయ అసిస్టెంట్లకు ఆయన శిక్షణ ఇచ్చారు. ఉద్యానవన శాఖ అధికారిణి జ్యోత్స్న పాల్గొన్నారు.

విద్యార్థులకు కంచాలు వితరణ

ప్రజాశక్తి - జామి

మండలంలోని శాసనాపల్లి గ్రామ సర్పంచ్ బసవ వెంకటప్పారావు గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం కంచాలు వితరణగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షబియా భేగం, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వర్రి పైడపు నాయుడు, ఉపాధ్యాయులు పి వి రమణ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కార్యాలయం ఏర్పాటుకు సహకరించండి

శృంగవరపుకోట: నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ కార్యకలాపాలను నిర్వహించడానికి కార్యాలయ గదిని కేటాయించాలని మంగళవారం తహశీల్దార్ అరుణకుమారికి వినతి పత్రాన్ని అందజేశామని సబ్ డిస్ట్రిక్ట్ చైర్మన్ డాక్టర్ వరలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నియోజకవర్గ కేంద్రంలో ఉన్న ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ సబ్ డిస్ట్రిక్ట్ బ్రాంచ్ కార్యకలాపాలు నిర్వహించడానికి ఆఫీసు గదిని ఏర్పాటు చేయమని వినతిపత్రం అందజేశామని ఈ బ్రాంచ్ ప్రెసిడెంట్ అయిన తహశీల్దారు స్పందిస్తూ తప్పనిసరిగా కార్యాలయం ఏర్పాటుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు డిస్ట్రిక్ట్ ఎంసి నెంబర్ డి.సూర్యారావు, వైస్ చైర్మన్ మల్లేశ్వరరావు, కార్యదర్శి జి ధనుంజయ్ పాల్గొన్నారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేయండి

ప్రజాశక్తి - బొబ్బిలి

మహిళలు లైంగిక వేధింపులకు గురైతే ఫిర్యాదు చేయాలని డిఎస్‌పి పి.శ్రీనివాసరావు కోరారు. మహిళలు, చిన్నపిల్లలపై జరుగుతున్న లైంగిక దాడులు నివారణకు పట్టణంలోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్ పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలు, కళాశాలల్లో బాలికలు, పని చేసే చోట మహిళలు లైంగిక వేధింపులకు గురైతే తప్పనిసరిగా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. లైంగిక వేధింపులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మహిళలు, చిన్నపిల్లలను గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. లైంగిక వేధింపులు చేసిన వారిని శిక్షించేందుకు కఠిన చట్టాలు ఉన్నాయని చెప్పారు. ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ వంటి వాటిపై పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో పట్టణ సిఐ కె.సతీష్ కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గజపతినగరం : మాట్లాడుతున్న సిఐ జిఎవి రమణ

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

రామభద్రపురం: విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని బొబ్బిలి రూరల్ సిఐ నారాయణరావు సూచించారు. స్థానిక కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థినిలకు భద్రత, సామాజిక స్పృహపై అవగాహన కల్పించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా భద్రతకు ప్రభుత్వం పెద్ద పీట వేస్తూ అనేక రక్షణ చట్టాలు అమలు చేస్తోందన్నారు. వసతి గృహల్లో చదువుతున్న విద్యార్థినులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. ఆధునిక సైబర్ నేరాలు ఎక్కువవుతున్న దృష్ట్యా ఫోన్ వినియోగంలో కూడా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రహదారి భద్రతా ప్రమాణాలు పాటించాలని, కళాశాలల్లో, బస్సుల్లో ప్రయాణించే సమయాల్లో ఈవ్ టీజింగ్ రేగింగ్ వంటి అసాంఘిక కార్యకలాపాలు ఎదురైతే దిశ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలని చెప్పారు. ఈ సమావేశంలో కెజిబివి ప్రిన్సిపాల్ మీసాల దీప, సిబ్బంది పాల్గొన్నారు.

బొబ్బిలి: మాట్లాడుతున్న డిఎస్‌పి శ్రీనివాసరావు

గజపతినగరం: అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని క్రమశిక్షణ, సత్ప్రవర్తన అలవర్చుకోవాలని సిఐ జివి రమణ అన్నారు. మంగళవారం మండలంలోని మరుపల్లి మోడల్ స్కూల్, కళాశాల విద్యార్థులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ గంజాయి వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఫోక్సో చట్టం, సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ కె.లక్ష్మణరావు, ప్రిన్సిపాల్ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి- శృంగవరపుకోట

పాఠశాలలు, కళాశాలల్లోనూ శానిటేషన్ వర్క్ చేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని సిఐటియు ఆధ్వర్యంలో మంగళవారం ఎంఇఒ నరసింహారావుకు వినతి పత్రాన్ని అందజేశామని సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటికి ఐదు నెలలుగా శానిటేషన్ వర్కర్లకు జీతాలు ఇవ్వకుండా పాలక ప్రభుత్వాలు వెట్టి చాకిరి చేయిస్తున్నాయన్నారు. జీతాలు ఇవ్వకపోతే కార్మికుల కుటుంబాలు ఎలా గడుస్తాయని ప్రశ్నించారు. కార్మికులకు భద్రతా పరికరాలు ఇవ్వాలని, పిఎఫ్, ఈఎస్ఐ ఉద్యోగ భద్రతతో పాటు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. మరుగుదొడ్ల క్లీనింగ్‌తో పాటు ఇతర గదుల శుభ్రం చేయడం, రికార్డులు అందించడం, జెరాక్స్ కాపీలు తీసుకువచ్చి ఇవ్వడం, పిల్లల్ని కంట్రోల్ చేయించడం వంటి పనులు చేస్తున్నారని వీరికి అరకొర వేతనం ఇస్తూ ఆ వేతనం కూడా సకాలంలో ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని చెప్పారు. నెలకు రూ.12వేలు జీతం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. సెప్టెంబర్ రెండో తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జరిగే కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎం పార్వతి, స్వాతి, ఎస్. రవణమ్మ, బంగారు భాస్కరి, తాండ్రంగి జ్యోతి, మజ్జి బుద్దమ్మ, కోసూరు వజ్రం, సూరతి కృష్ణమ్మ, సూరతి శాంతి పాల్గొన్నారు.

ఎంఇఒకు వినతి పత్రాన్నిస్తున్న కార్మికులు, సిఐటియు నాయకులు

సక్రమంగా జీతాలు చెల్లించండి

విజయనగరంకోట: ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలో పనులు చేస్తున్న శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్స్, సెక్యూరిటీ గార్డులు, సూపర్‌వైజర్ల బతుకులు కాంట్రాక్టర్లు అనే దళారీల చేతుల్లో పెట్టడం వలన ప్రతి నెలా సక్రమంగా జీతాలు చెల్లించకుండా ఇబ్బంది పెడుతున్నారని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ అన్నారు. మంగళవారం ఘోష ఆసుపత్రి, మహారాజా ఆసుపత్రి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 3 నెలలుగా దశల వారీగా వేతనం కోసం, ఉద్యోగ భద్రత కోసం ఉద్యమాలు చేస్తున్నప్పటికీ అధికారులు స్పందించలేదన్నారు. కార్మికులు కష్టార్జితంలో దాచుకున్న పి.ఎఫ్ డబ్బులను కాంట్రాక్టర్లు దోచుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. . శానిటేషన్, పెస్ట్ కంట్రోల్ వర్కర్లకు, సెక్యూరిటీ గార్డులకు, సూపర్‌వైజర్లకు సెప్టెంబర్ 5లోగా బకాయి ఉన్న జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేదంటే నిరాహారదీక్ష చేస్తామని తెలిపారు.

కాల్ గ్యాస్ డెలివరీ బాయ్‌లకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలి

వంట గ్యాస్ డెలివరీ బాయ్‌లకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని అశోక్ డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా కాల్ గ్యాస్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్‌తో సమావేశం నిర్వహించారు. సెప్టెంబర్ 1 2 3 తేదీల్లో జరగబోయే ఎఐటియుసి జాతీయ సమితి సమావేశాల్లో భవిష్యత్తు కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకుని పోరాటాలు కొనసాగిస్తామని తెలిపారు.

హర్షిత్‌ను అభినందిస్తున్న గెంబలి శ్రీనివాసరావు

రాష్ట్ర స్థాయి చదరంగం పోటీల్లో హర్షిత్ ప్రతిభ

ప్రజాశక్తి- బొబ్బిలి

విజయనగరంలో ఈనెల 25న జరిగిన జిల్లా స్థాయి అండర్-9 బాల, బాలికల చదరంగం పోటీలలో బాలుర విభాగంలో రాంబార్కి హేమనాగ హర్షిత్ ప్రతిభ కనబరిచి ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్నాడు. జిల్లా స్థాయి పోటీలలో ప్రతిభ కనబరచడంతో సెప్టెంబర్ 21, 22న జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీలకు అర్హత సాదించినట్లు కోచ్ ఎం.గణేష్ తెలిపారు. హర్షిత్‌ను అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షులు గెంబలి శ్రీనివాసరావు అభినందించారు. కుమారుడు ప్రతిభ కనబరచడంతో తండ్రి కిరణ్ ఆనందం వ్యక్తం చేశారు.

నిస్వార్థ సేవలకు మంచి గుర్తింపు

ప్రజాశక్తి- బొబ్బిలి

రోటరీ క్లబ్ డిస్ట్రిక్ట్ చైర్, కారుణ్య ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు చేస్తున్న నిస్వార్థ సేవలకు మంచి గుర్తింపు లభించింది. పట్టణంలో నివాసముంటున్న జేసీ రాజు కొన్నేళ్లుగా రోటరీ క్లబ్, కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించి పేదలకు అండగా ఉంటున్నారు. పేదలు, అనాధలు, అనారోగ్యంతో బాధపడుతున్న రోగులకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు జీవనోపాధి లేని మహిళలకు కుట్టుమిషన్ శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు పంపిణీ చేసి స్వయం ఉపాధి కల్పించేందుకు పని చేస్తున్నారు. జేసీ రాజు సేవలను గుర్తించిన విజయవాడకు చెందిన ఎక్సరే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ మదర్ థెరిస్సా అవార్డుతో సత్కరించింది. విజయవాడలోని హనుమంతు రాయ గ్రంధాలయంలో జేసీ రాజును మాజీమంత్రి నన్నపనేని రాజకుమారి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ జి.అనురాధ, డిప్యూటీ కలెక్టర్ కె.కృష్ణవేణి, కె.చంద్రశేఖర్ సత్కరించి అభినందించారు. అవార్డు మరింత బాధ్యత పెంచిందని, భవిష్యత్తులో సామాజిక కార్యక్రమాలు చేసి పేదలకు అండగా ఉంటామని జేసీ రాజు అన్నారు. మదర్ థెరిస్సా అవార్డు తీసుకున్న జేసీ రాజును రోటరీ క్లబ్ ప్రతినిధులు గెంబలి శ్రీనివాసరావు, వారాణసి శ్రీహరి, ఎస్.శ్రీనివాస్, పలువురు ప్రముఖులు అభినందనలు తెలుపుతున్నారు.

జెసి రాజును సత్కరిస్తున్న నిర్వాహకులు

నేత్ర దానంపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ బాలికల గురుకుల పాఠశాలలో వైద్యాధికారి డాక్టర్ గోపాలకృష్ణ ఆదేశాలు మేరకు ప్రిన్సిపాల్ టి. జయశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం 39వ జాతీయ నేత్రదాన పక్షోత్సవ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఆప్తాలమిక్ ఆఫీసర్ సి.హెచ్ ఈశ్వరరావు మాట్లాడుతూ ఆగష్టు 25 నుండి సెప్టెంబర్ 8వ తేదీ వరకు అవగాహనా ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. కంటిలో కార్నియాపై మచ్చలు ఉన్నవారికి నేత్ర దానం అవసరమని, నల్ల గుడ్డుపై మచ్చలు ఏర్పడడానికి ప్రధానంగా చిన్నారులలో పోషకాహార లోపం, ప్రధానంగా మీజిల్స్, సంక్రమణ కంటి వ్యాధులు, గాయాలు బారిన పడటం, కంటి శస్త్ర చికిత్స అనంతరం ఇన్‌ఫెక్షన్ సోకడం, పుట్టుకతో వచ్చే కంటి వ్యాధులు కారణంగా చూపు దెబ్బతిన్న వారికి అవసరమని తెలిపారు. నేత్ర దానంపై ప్రజలలో అపోహలు తొలిగించడానికి 39వ జాతీయ నేత్రధాన పక్షోత్సవ అవగాహన అవసరమన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒ నరసింహారావు, హెచ్ఎస్ ఈశ్వరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఈశ్వరరావు, సిబ్బంది దీప, ఉపాధ్యాయులు, ఎఎన్ఎమ్ భవాని, ఆశావర్కర్ వరలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది, విద్యార్థులు

పాఠశాలకు సామాగ్రి వితరణ

ప్రజాశక్తి - రామభద్రపురం

మండలంలోని ఇట్లా మామిడిపల్లి గ్రామానికి చెందిన వారణాసి నాగేంద్రబాబు, పల్లవి దంపతుల ప్రథమ పుత్రిక హార్ధికరామ జన్మదినాన్ని వినూత్నంగా స్థానిక పాఠశాలలో విద్యార్థులు, ఉపాధ్యాయుల నడుమ జరిపారు. పాఠశాల విద్యార్థుల ఉపయోగార్థం సుమారు 30వేల రూపాయలు విలువ చేసే పుస్తకాలు, పెన్నులు, పెన్సిల్లు, వివిధ రకాల నోట్సు పుస్తకాలు అన్ని తరగతుల విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాలకు కావలిసిన వస్తు సామాగ్రి ఫ్యాన్లు, కుర్చీలు, ఆఫీస్ సామాగ్రి వితరణ చేసి ఉదారత చాటుకున్నారు. వీటిని స్థానిక ఎంఇఒ తిరుమల ప్రసాద్ చేతుల మీదుగా అందజేయడం విశేషం. ఈ సందర్భంగా ఎంఇఒ మాట్లాడుతూ హార్ధికరామా జన్మదినాన్ని ఇలా పాఠశాలల్లో జరుపుకోవడం మంచి ఆలోచన అని ఆమెకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ కేక్ కట్ చేసి తలిదండ్రులు సమక్షంలో విద్యార్థుల శుభా కాంక్షలు కేరింతల నడుమ కేక్ తినిపించి ఆశీర్వచనాలు అందజేశారు. అనంతరం నాగేంద్రబాబు, పల్లవి దంపతులను సన్మానించారు. ఈ కార్య క్రమంలో హెచ్ఎం సత్యంనాయుడు, ఉపాధ్యాయులు వరప్రసాదరావు, గ్రామ పెద్దలు, టిడిపి మండల అధ్యక్షులు కరణం విజయ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఇఒ

పవన్ కల్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ పుట్టినరోజు వారోత్సవాలు జిల్లా చిరంజీవి యువత ఆధ్వర్యంలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఇప్పిలివీధిలో పారిశుధ్య కార్యక్రమాన్ని, పారిశుధ్య కార్మికులకు సన్మాన కార్య క్రమాన్ని అంజనీపుత్ర చిరంజీవి ప్రజాసేవా సంఘం, బ్లడ్ డోనర్స్ క్లబ్, అంజనీపుత్ర చిరంజీవి వాకర్స్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇప్పిలి వీధి రామమందిరం రోడ్డు, గొల్లవీధి కాలువలు శుభ్రపరచి, కాలువల్లో బ్లీచింగ్ చల్లారు. అనంతరం పారిశుధ్య కార్మికులను టిడిపి, జనసేన నాయకులు సత్కరించారు.

బొబ్బిలి: జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలు సెప్టెంబర్ ఒకటి ఆదివారం సాయంత్రం 4గంటల నుంచి జనసైనికుల నిలయంలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు జనసేన రాష్ట్ర కార్యనిర్వహణ కార్యదర్శి బాబు పాలూరి తెలిపారు. పవన్ కళ్యాణ్ జన్మదిన వేడుకలకు రాష్ట్ర మంత్రులు గుమ్మడి సంధ్యారాణి, కొండపల్లి శ్రీనివాస్, ఎమ్మెల్యేలు హాజరవుతారని చెప్పారు. జనసైనికులు, వీర మహిళలు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారని చెప్పారు. జన్మదిన వేడుకలను జయప్రదం చేయాలని కోరారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
I.A.512/2023 in I.A.No.1089/2015 in O.S. No. 277/2009

BETWEEN:
పేస రామ అప్పారావు మరియు ముగ్గురు ఇతరులు,
...... పిటీషనర్స్/ప్లయింటిప్స్
AND:
పేస శ్రీను మరియు 9 మంది ఇతరులు
.......రెస్పాండెంట్స్/డిఫెండెంట్స్

నోటీసు టు రెస్పాండెంట్ నెంబర్ 11, 12, 13, 14 & 15.
R11) చొల్లంగి ధనలక్ష్మి W/o లేటు సన్యాసిరావు, పెద్దపల్లి వీధి, విజయనగరం టౌన్ మరియు జిల్లా.
R12) చొల్లంగి శంకరరావు, S/o లేటు సన్యాసిరావు -Rest Ditto-
R13) చొల్లంగి రాజా, S/o లేటు సన్యాసిరావు, -Rest Ditto-
R14) కరణం ఈశ్వరమ్మ W/o త్రినాధరావు, -Rest Ditto-
R15) సమేనాజయలక్ష్మి W/o రాములు, లింగంపర్తి గ్రామము , రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.
Hg. Date:05-09-2024

పై పిటీషనర్లు, పై రెస్పాండెంట్స్ పై, పైన పేర్కొన్న దావాలో పిటిషన్ వేసియున్నారు. సదరు పిటిషన్లో రెస్పాండెంట్ నెం.4 మరణించినారు. సదరు రెస్పాండెంట్ నెం.4కు లీగల్ హెయిర్ రెస్పాండెంట్ నెం.11, 12, 13, 14 మరియు 15లను చేర్చినారు. సదరు పిటిషన్లో మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీకోర్టు వారి నుండి అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పైనెంబర్ కేసు తే 05-09-2024 దిన వాయిదా వున్నదని ఈపత్రికముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 05-09-2024 దిన ఉదయం గం. 10.30 నిమిషాలకు** మీరుకానీ లేదా మీ తరపున వకీలుగారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీతరపున వాదనలు విన్నవించుకోవలెను. లేనియెడల పైన తెలిపిన కేసులో మీపరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT //
ఇట్లు
B.శ్రీనివాస్‌కుమార్,
పిటీషనర్ తరపున న్యాయవాది,
విజయనగరం.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT VIZIANAGARAM.
I.A.511/2023 in O.S. No. 277/2009

BETWEEN:
పేస రామ అప్పారావు మరియు ముగ్గురు ఇతరులు,
...... పిటీషనర్స్/ప్లయింటిప్స్
AND:
పేస శ్రీను మరియు 9 మంది ఇతరులు
.......రెస్పాండెంట్స్/డిఫెండెంట్స్

నోటీసు టు రెస్పాండెంట్ నెంబర్ 11, 12, 13, 14 & 15.
R11) చొల్లంగి ధనలక్ష్మి W/o లేటు సన్యాసిరావు, పెద్దపల్లి వీధి, విజయనగరం టౌన్ మరియు జిల్లా.
R12) చొల్లంగి శంకరరావు, S/o లేటు సన్యాసిరావు -Rest Ditto-
R13) చొల్లంగి రాజా, S/o లేటు సన్యాసిరావు, -Rest Ditto-
R14) కరణం ఈశ్వరమ్మ W/o త్రినాధరావు, -Rest Ditto-
R15) సమేనాజయలక్ష్మి W/o రాములు, లింగంపర్తి గ్రామము , రాజమండ్రి, తూర్పుగోదావరి జిల్లా.
Hg. Date:05-09-2024

పై పిటీషనర్లు, పై రెస్పాండెంట్స్ పై, పైన పేర్కొన్న దావాలో పిటిషన్ వేసియున్నారు. సదరు పిటిషన్లో రెస్పాండెంట్ నెం.4 మరణించినారు. సదరు రెస్పాండెంట్ నెం.4కు లీగల్ హెయిర్ రెస్పాండెంట్ నెం.11, 12, 13, 14 మరియు 15లను చేర్చినారు. సదరు పిటిషన్లో మీ యొక్క హాజరు నిమిత్తము శ్రీకోర్టు వారి నుండి అనేక పర్యాయములు నోటీసులు పంపిననూ మీరు తీసుకోనందున మీకు నోటీసు నిమిత్తము శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము పైనెంబర్ కేసు తే 05-09-2024 దిన వాయిదా వున్నదని ఈపత్రికముఖంగా తెలియపరుస్తూ సదరు తేది అనగా **తే 05-09-2024 దిన ఉదయం గం. 10.30 నిమిషాలకు** మీరుకానీ లేదా మీ తరపున వకీలుగారి ద్వారా కానీ పైకోర్టులో ప్రత్యక్షంగా హాజరు అయి మీతరపున వాదనలు విన్నవించుకోవలెను. లేనియెడల పైన తెలిపిన కేసులో మీపరోక్షమున విచారించి తీర్మాణించెదరని శ్రీకోర్టువారి ఉత్తర్వులు ప్రకారము ఈప్రకటన ద్వారా తెలియపరచడమైనది.

// BY THE ORDER OF THE HONOURABLE COURT //
ఇట్లు
B.శ్రీనివాస్‌కుమార్,
పిటీషనర్ తరపున న్యాయవాది,
విజయనగరం.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు

ప్రజాశక్తి-చీపురుపల్లి

స్థానిక బ్రహ్మకుమారీస్ సేవా కేంద్రంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు సోమవారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా చిన్నారులకు నిర్వహించిన బెస్ట్ కృష్ణ, బెస్ట్ రాధ పోటీల్లో బాల బాలికలు 70 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో నిర్వహించిన పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన బాల బాలికలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకృష్ణ జన్మాష్టమి ఆధ్యాత్మిక రహస్యాన్ని సేవా కేంద్రం ఇంచార్జి సోదరి బికె శాంతి వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టు కున్నాయి. కార్యక్రమంలో ఉప తహశీల్దార్ పి.రామారావు, చుట్టుపక్కల గ్రామానికి చెందిన బ్రహ్మకుమారీలు పాల్గొన్నారు.

అలరించిన శాస్త్రీయ నృత్యాలు

శృంగవరపుకోట: స్థానిక వేణుగోపాల స్వామి ఆలయంలో సోమవారం రాత్రి కృష్ణాష్టమి సందర్భంగా చిన్నారులు రాధ, గోపిక, కృష్ణుడి వేషధారణలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన శాస్త్రీయ కూచిపూడి నృత్యాలు ఆహుతు లను మంత్రముగ్ధులను చేశాయి. లాస్యశ్రీ, హనన్య, హృషీకేశ్, మోనీష్ నాట్య ప్రదర్శన ఆకట్టుకుంది. పాల్గొన్న ప్రతీ ఒక్కరికీ ప్రోత్సాహక బహుమతులను దేవి, రమ్య అందజేసి అభినందించారు.

చీపురుపల్లి : పిల్లలకు బహుమతులు ప్రదానం చేస్తున్న బ్రహ్మకుమారీస్

IN THE HONOURABLE COURT OF ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM
H.M.O.P 32/2022

Between:-
Gedela @Cheekati Hemalatha
.......Petitioner
And
Gedela Rambabu .....Respondent

RESPONDENT
Gedela Rambabu, S/o.Sattibabu, Hindu aged about 40 years, working as a Software Engineer, K.P.I.T., Banglore, permanent resident of Bodduru village, Santhakaviti mandal, Vizianagaram district.

NOTICE
Please take notice that the above matter is posted on Dt.12/09/2024 for your appearance. You are hereby directed to appear before the Hon'ble Court on **Dt.12/09/2024 at 10.30 A.M.** either in person or through an Advocate without fail and file your objections if any, otherwise the matter will be decided in your absence.

By Court Order

D.T.MANI CHANDAN
Advocate for Petitioner
Srikakulam

Government of Andhra Pradesh
APEWIDC., Vizianagaram Division
NIT No. EE/DB/ 1 to 2/2024-25 dt. 24.08.2024.

Tenders invited from Registered Civil Contractors for NIT No. EE/DB/ 1 to 2 dt. 24.08.2024 for 2 Works at various places from Rs. 5.00 Lakhs to 40.00 lakhs.

Last date for receipt of Tenders 02.09.2024 up to 4.00 PM. Note:- for further details can be viewed at http// Tender "e" procurement.gov.in or Contact: 8008102811.

(D.V.N. Murthy)
Executive Engineer APEWIDC.,
Vizianagaram.